

# కథా కౌముది

## ప్రత్యూష రాగం

కైలాస్ పులుగుర్త – హైదరాబాద్

### "విశ్వావసు" నామ సంవత్సర ఉగాది సందర్భంగా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 30 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో 'నా మొట్టమొదటి కథ' విభాగంలో బహుమతి పొందిన కథ

**"ఈరోజు మా అక్క వస్తోందని** చెప్పానుగా ఆనంద్, గుర్తుందా?"

"ఎందుకు గుర్తులేదు నందూ, రైల్వే స్టేషన్ కి వెళ్లి రిసీవ్ చేసుకుంటాను."

ఒక రెండుగంటల తరువాత కారులోనుండి దిగిన మానసకు ఎదురెళ్లుతూ "అక్కా వచ్చేసావా!" నీకోసమే చూస్తున్నానంటూ" సంభ్రమంగా ఎదురువెళ్లి అక్కను కౌగలించుకుంది నందిని.

"ఏరే నీ పిల్లలు?" ఇల్లంతా కామ్ గా ఉందేమిటంటూ ఆశ్చర్యంగా లోపలికి తొంగిచూసింది మానస."

"ఈ పిల్ల వెధవలతో చస్తున్నానే అక్కా. ఒకవైపు ఉద్యోగం, మరోవైపు పిల్లలతో క్షణం తీరిక లేదనుకో."

ఈలోగా అయిదేళ్ల 'ఆకాష్' అమ్మా అంటూ తల్లి నందిని చీర కుచ్చెళ్లల్లోకి దూరిపోతూ పెద్దమ్మ వైపు పెద్ద పెద్ద కళ్లతోచూస్తున్నాడు.

"పెద్దమ్మరా ఆకాష్, వెళ్లు అంటూ" వాడిని కాస్త ముందుకుతోసింది. వాడు సిగ్గు పడుతుంటే, "రారా చిన్నూ, పెద్దమ్మని మరచిపోయావా" అంటూ వాడిని దగ్గరకు లాక్కుంటూ ముద్దుపెట్టుకుంది.

వీడికి అల్లరి బాగా ఎక్కువైందే అక్కా, చదువు బొత్తిగా తగ్గిపోయింది. మొన్న జరిగిన పరీక్షల్లో అన్నీ సింగిల్ డిజిట్ మార్కులే. టీచర్ నాకు ఫోన్ చేసి మీ ఆకాష్ చదువులో చాలా వీక్ గా ఉన్నాడనేసరికి సిగ్గుతో చచ్చిపోయాననుకో." వాళ్ల మాటలతో తనకు సంబంధం ఏమాత్రం లేనట్లు, ఆ మార్కులకు విలువేమిటో అర్థం కాని చిన్నూ, పెద్దమ్మ ఇచ్చిన మిల్క్ బార్ చాక్ లెట్ తీసుకుని గెంతుకుంటూ వరండాలోకి వెళ్లిపోయాడు.

పెద్దాడు గౌతమ్ ఫరవాలేదే అక్కా. వాడిగురించి బెంగలేదు. తెలివైన వాడే. ఇదిగో వీడితోనే చిక్కు. చదవమంటే చదవడు. స్కూల్

కి వెళ్లడానికి ఒకటే పేచీ పెడ్తాడు."

"పోనీలే నందూ, పసి వెధవ, వాడికేం తెలుసు, ఈ చదువులూ, రేంక్లూనూ. ఇంకాస్త పెద్ద క్లాస్ కు వస్తే వాడికే అర్ధమౌతుంది. ఇంకా ఎల్.కే.జీ వాడు చదివేది. ఒక వారమే అయిందికదా అయిదొచ్చి."

"మన ఆకాష్ ఒక్కడేనా చిన్న పిల్లాడు? వాడి తోటి పిల్లలందరికీ ఎంత మంచి మార్కులొచ్చాయో తెలిస్తే ఆశ్చర్యపోతావ్?"

"సరేగానీ, ఊరికే టెన్షన్ పడకే నందూ, వాడే పికప్ అవుతాడంటూ" చెల్లెలికి సర్దిచెప్పింది.

ఇంక ఈ చంటాడు రోషీ , సరిగా తిండి తినడే అక్కా. పనిపిల్లను ఒకటే సతాయిస్తాడు ఏమీ తినకుండా. ఏమి చేయను చెప్పు. ఆఫీసులో వీడే గుర్తుకొస్తాడు. అన్నం తిన్నాడో లేదో, పాలు తాగేడో లేదోనన్న ఒకటే టెన్షన్. మీ మరిదికి ఇవేమీ పట్టవు. ఆఫీసూ, పని, కేంప్ లతో క్షణం తీరిక ఉండదు తనకు.

ముత్యాల్లాంటి ముగ్గురు మగపిల్లలు తన చెల్లెలు నందినికి. గౌతమ్, ఆకాష్, రోషన్. అందంగా ముద్దుగా ఉంటారు. వారి అల్లరిని ఒకవైపు విసుక్కుంటూనే, మరోవైపు శ్రద్ధగా స్కూల్ హోమ్ వర్క్ చేయిస్తూ, వాళ్లకు అన్నంకలిపి నోట్లో తినిపిస్తున్న చెల్లెలు నందిని వైపు మురిపంగా చూస్తూ, ఆమె మాటలను సానుభూతితో వింటోంది మానస.

"నీ పనే నయమనుకో అక్కా, ఏ బాదరబందీలూ లేకుండా హాయిగా ఉన్నావంటూ" పిల్లలకు మూతులు తుడిచి తామిద్దరకూ భోజనాలు వడ్డించింది.

నందిని ఏదో సహజంగా అనేసిందే గానీ తనని చిన్నబుచ్చాలనీ కాదు. అక్కకు పిల్లలు లేరేనని బాధపడడమే కాదు, "నా పిల్లలే నీ పిల్లలనుకోవే అక్కా" అంటూ అభిమానంగా అంటుంది.

గౌతమ్ ని, ఆకాష్ ని మంచి స్కూల్లో చేర్పిస్తే, ఎల్.కే.జీ కే అయిదులక్షలు డొనేషన్ కట్టాలని చెప్పింది. రోజూ ఇంటి దగ్గరకే బస్ వచ్చి పికప్ చేసుకుని, సాయంత్రం దింపుతుందని, ఒక్కొక్కరికి బస్ కు నెలకు ఇరవై వేలు అవుతుందే అక్కా, మీ మరిది ఏదో మామూలు స్కూల్ లో వేద్దామంటున్నారని చెప్పింది పిల్లలను స్కూల్లో జాయిన్ చేసేముందు. గౌతమ్ ని చేర్చేటప్పుడు అయిదు లక్షలు, ఆకాష్ ను జాయిన్ చేసేటప్పుడు మరో అయిదు లక్షలు పంపింది. చెల్లెలూ, మరిది ఇద్దరూ సంపాదిస్తున్నా, ముగ్గురు పిల్లలతో ఈ రోజుల్లో వాళ్లను పెంచి, చదువులు చెప్పించడం ఎంత కష్టమో తనకు అర్థం కానిది కాదు. తన భర్త బాగా సంపాదించడమే కాదు, స్వతహాగా మంచి ఆస్తి పాస్తులున్న కుటుంబానికి ఏకైక వారసుడు. తనుకూడా గవర్న్ మెంట్ కాలేజ్ లో సైకాలజీ లెక్చరర్ గా కొంతకాలం పనిచేసి ఇంకో పదేళ్ల సర్వీస్ ఉందనగా వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకుంది. తన తరువాత చెల్లెలు నందిని, తమ్ముడు శరత్. తనకూ, నందినికీ పది సంవత్సరాల వయస్సు వ్యత్యాసం. ఆ తరువాత ఆఖరి వాడు శరత్.

చెల్లెలు పిల్లలన్నా, తమ్ముడు పిల్లలన్నా విపరీతమైన ఇష్టం. అందుకే చెల్లెలునూ, పిల్లలనూ చూడాలని, అన్నీ మరిచిపోయి పిల్లలతో ఆనందంగా గడపాలని వైజాగ్ నుండి హైద్రాబాద్ వచ్చింది. తను వచ్చానని నందిని లీవ్ పెట్టేసింది. పిల్లల ఆటపాటలతో, చెల్లెలు చూపించే అభిమానంతో, వారంరోజులూ ఇట్టే హడావిడిగా గడచిపోయాయి. ఇంక రేపే తిరుగు ప్రయాణం తనకు.

పిల్లలతో బాగా అలవాటు పడింది మానస. ఏమిటో వదిలి వెళ్లాలంటే చాలా దిగులు అనిపిస్తోంది. పిల్లలతో చెల్లెలు పడుతున్న అవస్థను కూడా గమనించింది. చెల్లెలుకి సహాయపడాలన్న ఉద్దేశ్యంతో, "నందూ పోనీ చిన్నూని నేను తీసుకువెడతానే. వైజాగ్ లో కూడా మంచి మంచి కాన్వెంట్ స్కూళ్లు ఉన్నాయి. అక్కడ చేరుస్తాను వాడ్ని. నేను ఖాళీనే కదా, వాడి చదువు – సంధ్య దగ్గరుండి చూసుకుంటాను. వాడు నాదగ్గర బాగా మాలిమి అయ్యాడు కూడాను...." చెల్లెలను అడగకుండా ఉండలేకపోయింది మానస.

"అయ్యో అక్కా, ఈ అల్లరి వెధవను విడిచి, నేను ఒక్క క్షణం ఉండలేనంటూ, అక్కడే ఆడుకుంటున్న ఆకాష్ ని దగ్గరకు పిలిచి

ఒడిలో కూర్చోపెట్టుకుని వాడి బుగ్గలను ముద్దాడుతూ, "నేనే కాదక్కా, వాళ్ల నాన్న కూడా ఈ చిచ్చర పిడుగుని విడిచి క్షణమైనా ఉండలేడు. నీకో సంగతి తెలుసా?" ఆదివారం వస్తే చాలు వాళ్ల నాన్నా, వీళ్లూ కలిసి చేసే అల్లరి. వాళ్ల నాన్నాతో కలసి చేసే అల్లరికి ఇల్లు దద్దరిల్లిపోతుంది. దొంగాటలూ, గంతులూ, డాన్స్ లతో ఇల్లు పీకి పందిరేస్తారు. ఆనంద్ కూడా ఒకచిన్నపిల్లాడిలా వీళ్లతో గంతులేస్తాడు. వాళ్లను దగ్గర కూర్చోపెట్టుకుని ఏదైనా నేర్పించవచ్చు కదా అంటాను. "పోనీలే నందూ, ఆదివారాలు పిల్లలను స్వేచ్ఛగా వదిలేయాలి. వాళ్లతో మనమూ ఆడుతూ పాడుతూ ఉంటే వాళ్ల ముఖాలు ఆనందంతో వెలిగిపోతాయి. అంతేకాదు, ఆ వారమంతా ఫ్రెష్ గా ఉంటారు. ఆట, పాటలు పిల్లల మనోవికాసానికి తోడ్పడతాయంటూ ఉపన్యాసాలు దంచేస్తారులే."

"ఆకాష్ అల్లరిచేస్తుంటే ఆ క్షణంలో విసుగు, చికాకు వచ్చి వాడిని నాలుగు అంటిస్తాను గానీ, వాడు వెక్కి వెక్కి ఏడుస్తుంటే, నాకూ ఏడ్పు వచ్చేస్తుందనుకో. వాడిని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంటే, వాడు నా ఒడిలో దూరిపోయి కిల కిలా నవ్వుతుంటూ, అన్నీ మరచిపోతాను. అయినా వాడిని చూసి ముచ్చటపడిపోయి తీసుకువెడతా నంటున్నావు గానీ, వాడెంత పెంకి ఘటమో నీకు తెలియదు. అనుకున్నంత ఈజీ కాదక్కా పిల్లలను పెంచడం. నీవైతే ఒక్కరోజు కూడా వీడ్ని దగ్గరుంచుకుని చూసుకోలేవు. గేరంటీగా చెపుతున్నాను. ఏ అర్థరాత్రో, అపరాత్రో లేచి నాకు అమ్మకావాలీ అని ఏడిస్తే, నీవు సముదాయించగలవా వాడిని?"

చెల్లెలి మాటలకు మానస మనస్సు చివుక్కుమనిపించినా, అంతలోనే సర్దుకుంటూ "అవునే నందూ, పిల్లలను విడిచి ఏ తల్లిదండ్రులూ ఉండలేరు. అది సహజం. అయినా నీవన్నట్లు ఆకాష్ బెంగపడితే కష్టం కదా!" తను కూడా చాలా సహజంగా తీసుకున్నట్లే మాట్లాడింది.

హైద్రాబాద్ నుండి వచ్చేస్తుంటే, మానస మనస్సు ఎందుకో శూన్యంగా అనిపించ సాగింది. ఇంతకాలం తన ఉద్యోగం, ఇతర బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా గడిపింది. పిల్లలు లేరేనన్న ఆలోచనకు తావీయకుండా. ఉద్యోగం మీద విసుగేసి వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకుంది. ఇప్పుడు అంతా ఖాళీనే. పిల్లలు లేరేనన్న వెలితి ఇప్పుడు స్పష్టంగా అర్థమౌతోంది. నిరంతరం మనస్సుని కృంగతీస్తోంది.

పిల్లలను చూడడం అంత ఈజీ కాదన్న చెల్లెలి మాటలు గుర్తుకొచ్చాయి. ఎందుకో తమ ఇంటి పక్కనే ఉంటున్న రమేష్ గారబ్బాయి చందూ గుర్తుకొచ్చాడు.

రమేష్ బేంక్ లో పనిచేస్తాడు. ట్రాన్స్ ఫర్ మీద వైజాగ్ వచ్చి తమ ఇంటి పక్కనే ఉన్న ఇంట్లోకి అద్దెకు దిగాడు. తన భర్త రాజేంద్ర కు మంచి స్నేహితుడైనాడు. తనను అక్కా అంటూ ఎంతో అభిమానంగా ఉంటాడు. అతనికి ఏడేళ్ల కొడుకు చందూ. రమేష్ ది ప్రేమ వివాహం. చందూ పుట్టిన అయిదు సంవత్సరాల తరువాత ఆవిడకు ఏదో తీవ్ర అనారోగ్య సమస్య వచ్చి చనిపోయిందిట. భార్యమీద ప్రేమతో ద్వితీయ వివాహం చేసుకోక, కొడుకుకి అన్నీ తానై పెంచుకుంటున్నాడు. కొడుకు స్కూల్ నుండి అయిదుగంటలకు వచ్చేవేళ ఒక అరగంట ముందుగానే తను వచ్చేస్తాడు. బేంక్ కూడా ఇంటికి దగ్గరే. ఒకరోజు చందూ స్కూల్ బస్ నుండి ఇంటిముందు దిగేడు. ఇంటి గేట్ ఇంకా తెరిచిలేదు. నాన్న వస్తే తన కోసం అక్కడే నిలబడి ఎదురుచూస్తాడని చందూకి తెలుసు. నాన్న రాలేదని అర్థమైన చందూ అటూ ఇటూ చూస్తుంటే తనే వాడిని చూసి తమ ఇంటికి పిలిచింది. పాలు కలిపి బిస్కెట్స్ తోబాటూ ఇచ్చింది. చాలా మొహమాటంగా తీసుకున్నాడు. తరువాత కంగారు పడుతూ రమేష్ వచ్చాడు. ఆఫీస్ లో ఆలస్యమైందని చెప్పాడు. ఫరవాలేదు రమేష్, ఎప్పుడైనా మీకు రావడం ఆలస్యం అయితే మా ఇంట్లో ఉండమని చెప్పండి చందూకి అని చెప్పింది. అప్పటివుండి చందూ తమింటికి రాకపోకలు సాగించేవాడు. తనతో ఎన్నో కబుర్లు చెప్పేవాడు. తనకు బాగా మాలిమి అయ్యాడు. వాడికి ఎన్నో కథలు చెప్పేది. వాడితో ఆటలు ఆడేది. తనకు ఎంతో మురిపంగా అనిపించేది. అనుకోకుండా రమేష్ కు మరో ఊరు బదిలీ అవడంతో వాళ్లు వెళ్లిపోయారు. పిల్లలతో పెంచుకున్న అనుబంధం అన్ని అనుబంధాలకంటే గొప్పది. చందూ గుర్తుకొచ్చినప్పుడల్లా మనస్సంతా ఏదో లా అయిపోయేది.

ఆ మధ్య తమ్ముడు శరత్ దగ్గరకు బెంగుళూర్ వెళ్లింది. శరత్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు. వాడికి ట్విన్స్. ఇద్దరూ ఆడపిల్లలే. రెండోసారి గర్భవతి అయింది తన మరదలు. మరదలు ఉష బాగా చదువుకున్నా, ఉద్యోగం చేయాలన్న ఆసక్తి లేదు. తమ్ముడు బాగానే సంపాదిస్తున్నాడు. పిల్లల సంరక్షణ అంతా ఉషే చూసుకుంటుంది. ఆడపిల్లిద్దరికీ బంగారు గొలుసులు, గాజులు, నెక్లెస్ లు కొనిచ్చింది. బంగారు బొమ్మల్లా ముద్దుగా ఉంటారు. అక్కడ పరిస్థితిని గమనించి తమ్ముడితో "ఒరేయ్ శరత్, ఉషకి ఇంకో నెలలో పురుడు వస్తుందని చెప్పావు కదా. నీ కూతుళ్లిద్దరినీ నేను తీసుకువెడతానురా శరత్. కొంత కాలం ఉంటారు. ఉష పురిటి బిడ్డను చూసుకుంటూ, పిల్లలిద్దరినీ చూసుకోవడం కష్టం అవుతుంది కదా!" మీ అత్తగారు డెలివరీ కి సాయం చేయడానికి వచ్చినా, పాపం పెద్దావిడకి నీ కూతుళ్లను కూడా చూసుకోడం కష్టం అవుతుంది కదరా. రెండు మూడు నెలలవగానే పిల్లలను తీసుకొచ్చి దింపుతాను. "ఏమంటావురా!" అంటూ అడిగింది.

"నీవల్లేమౌతుందే అక్కా, నీవెప్పుడైనా పిల్లలని పెంచావా ఏమన్నానా?" ఉష కాబట్టి ఎంతో జాగ్రత్తగా పిల్లలను క్రమశిక్షణతో పెంచుతోంది. నీవు తీసుకెడితే, నీవు చేసే గారాబానికి వాళ్లు మొండిగా తయారయి మా మాట వినడం మానేస్తే, ఆ తరువాత ఇంక మా పని గోవిందా," అంటూ నాటక ఫక్కీలో రెండుచేతులూ పైకెత్తేసాడు.

ఉష కూడా నవ్వుతూ "అవును వదినా, పిల్లిద్దరినీ ఎల్.కె.జీ లో వేసాం, వాళ్లను దగ్గరుండి చదివించాలి. లేకపోతే చదువులో వెనక పడిపోతారు. మీకివన్నీ కొత్త, సమర్థించలేరంటూ మృదువుగానే చెప్పింది." తను పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసి కాలేజ్ లో ఇరవై అయిదు సంవత్సరాలు లెక్చరర్ గా పనిచేసింది. చదువు విలువ ఏమిటో తనకేమీ తెలియదన్నట్లు మాట్లాడతారు అందరూ. తను పిల్లలను ఎల్.కే.జీ చదివించలేదా విడ్డూరం కాకపోతే? తమ్ముడు రెండు సంవత్సరాల క్రితం అపార్ట్ మెంట్ కొనుక్కుని గృహప్రవేశం చేసుకున్నప్పుడు ఒక అయిదు లక్షలు చెక్ చేతికి అందిస్తూ, కొత్త ఇంట్లోకి కొత్త ఫర్నిచర్ కొనుక్కోరా శరత్ అంటూ ప్రేమగా ఇచ్చింది. తనకి ఉన్నది చెల్లెలూ, తమ్ముడే. వారి పిల్లలను తన పిల్లలులాగే భావిస్తుంది. పండుగలకు, పుట్టిన రోజులకు బహుమానాలూ, బట్టలూ కొనిపంపిస్తుంది.

ఈసారి ఎవరో ఒకరి పిల్లలను తెచ్చుకుని తన దగ్గర కొంతకాలం ఉంచుకోవాలని ఆరాటపడింది. కానీ తన ఆరాటానికి అర్థం లేకుండా పోయేసరికి, తన కోరికను అణిచేసుకుని ఇంటికి తిరిగి వచ్చేసింది. తమ్ముడికీ, చెల్లెలికీ తనంటే అభిమానమే. "మా పిల్లలు నీ పిల్లలు కాదా అక్కా!", నీకు పిల్లలను ఎప్పుడు చూడాలనిపిస్తే అప్పుడు వచ్చేయమంటారు. వారి మాటలు గుర్తొచ్చి ఎందుకో నిస్తేజంగా నవ్వుకుంది. నిజమే, వారం రోజులు చెల్లెలు పిల్లలతోనూ, తమ్ముడు పిల్లలతోనూ గడిపి వచ్చిన తనకు, వాళ్లను విడిచి వస్తుంటే ఎంతో కష్టమనిపించింది. వాళ్ల ముద్దుమాటలు, అల్లర్లు, చేష్టలూ, ఒక గాఢమైన దివ్యపరిమళంలా మనసుని అంటిపెట్టుకుని పరవశింపచేస్తున్నాయి. తనకే అలా ఉంటే, నవమాసాలూ మోసి వాళ్లను కన్న తల్లిదండ్రులకు వారిని విడిచి ఉండడం కష్టంగా ఉండదా, కష్టమో, సుఖమో వాళ్లే పడదామనుకుంటారే గానీ, ఎక్కడకో పంపేయాలని ఎలా అనుకుంటారు! మాతృత్వం స్త్రీలకు దేవుడిచ్చిన వరం. తనకా అదృష్టం లేదు.

ఎందుకో గతం కళ్లముందు కదలాడుతుంటే నిస్సత్తువుగా అలా కూర్చుండి పోయింది.

మానస, రాజేంద్రలది అనురాగ దాంపత్యం. ఇద్దరూ ఎమ్.ఏ సైకాలజీ చదువుతున్నప్పుడు వైజాగ్ లో క్లాస్ మేట్స్. పి.జి అయిపోయాకా తను అక్కడే కాలేజ్ లో లెక్చరర్ గా చేరిపోయింది. రాజేంద్ర ఆంధ్రా యూనివర్సిటీ లో పి.హెచ్.డి చేసాడు. అక్కడే ప్రొఫెసర్ గా చేస్తున్నాడు. పి.జి. చేస్తున్నప్పటి నుండి ఎంతో స్నేహంగా ఉండే తమ బంధం ప్రేమకు దారితీయడం, చివరకు పెళ్లి చేసుకోవడం జరిగింది. పెళ్లైన రెండు సంవత్సరాలకు తను గర్భవతి అయింది. స్కానింగ్ లో బేబీకి హార్ట్ లో హోల్ ఉందని తెలిసి తల్లడిల్లిపోయారు. డాక్టర్ సూచన మేరకు గర్భాన్ని తీయించుకోక తప్పలేదు. రెండో సారి, మూడో నెలలోనే ఎబార్షన్ అయిపోయింది. తను మానసికంగానూ, శారీరకంగానూ బలహీనురాలైంది. గర్భసంచి బలహీనంగా ఉందని, రిస్క్ తీసుకోవద్దని డాక్టర్ హెచ్చరించినా,

తన మొండి వైఖరి మూలాన మూడోసారి కన్సీవ్ అవడం జరిగింది. అదేమి దురదృష్టమో కానీ అది కూడా నిలవలేదు. ఆ తరువాత గర్భసంచిని తీసేయాల్సిన పరిస్తితి వచ్చింది.

తనకు పిల్లలంటే ఎంతో ఇష్టం. తను తల్లి కావాలని మనసారా కోరుకుంది. తనకా అదృష్టం లేదని తెలిసి చాలా మనోవేదన చెందింది. ఎంతో ఉత్సాహంగా, చలాకీగా ఉండే తను ఏదో పోగొట్టుకున్నట్లు, నిరాశగా ఉండేది. పోనీలే, తన తమ్ముడుకి, చెల్లెలికి పిల్లలున్నారు కదా, ఎవరినో ఒకరిని అడిగి వాళ్ల పిల్లనో, పిల్లాడినో తను పెంచుకోవాలని ఆశపడింది. చెట్టుకు కాయలు బరువు కాదన్నట్లు, తల్లికి బిడ్డలూ భారం కాదని అర్ధమైంది.

ఇలా వివిధ ఆలోచనలలో మునిగిపోతూ, గతాన్ని తలచుకుంటున్న మానసకి సమయం ఎంతైదో కూడా తెలియలేదు. చుట్టూ సంధ్యా కాంతులు అలుముకుంటున్నాయి. చంద్రుడు ఎప్పుడెప్పుడు ప్రత్యక్షమౌదామా అనుకుంటూ మాటి మాటికి మేఘాల చాటునుండి దొంగచూపులు చూస్తున్నాడు.

అప్పుడే రాజేంద్ర మానసని వెతుక్కుంటూ, ఇంటివెనుకనున్న తోటలోకి వచ్చాడు. అక్కడ సిమెంట్ బెంచీ మీద మానస ఒంటరిగా కూర్చుని ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్లు గమనించాడు. దగ్గరకు వస్తూ, "ఏమిటి మనూ ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్టున్నావు, నాకు చెప్పకూడదా ఏమాలోచిస్తున్నావో అంటూ" ఆమె పక్కనే కూర్చున్నాడు.

భర్త రాకతో మానస ఆలోచనల నుండి బయటపడి వాస్తవానికి వచ్చింది.

మనస్సులోనుండి బయటకు వస్తున్న దీర్ఘ నిట్టూర్పుని భర్తకు వినపడనీయకుండా లోలోపలే అణచివేస్తూ"ఏముంది రాజూ, వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకున్నాకా బోలెడు సమయం మిగిలిపోతోంది. ఈ సమయాన్ని ఎలా వినియోగిద్దామా, ఏ సంఘ సేవచేద్దామా అని ఆలోచిస్తున్నాను. మీరైమైనా సలహా ఇవ్వగలరా?" ముఖంమీద నవ్వును పులుముకుంటూ అడిగింది.

మానస తమకు పిల్లలు లేరేనన్న అసంతృప్తిని భర్త దగ్గర ఎప్పుడూ వెల్లడించలేదు. కానీ, అతనికి భార్య అంతరంగం పూర్తిగా అవగతమే. ఆమె ప్రతీ కదలిక, చూపులో ఉన్న భావం ఇట్టే పసిగట్టగలడు. సైకాలజీ సబ్జక్ట్ లో డాక్టరేట్ చేసి యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పవనిచేస్తున్న రాజేంద్ర, భార్య మనస్సులోని ఆరాటాన్ని, ఆలోచనలనూ అర్థం చేసుకోలేని అమాయకుడు కాదు. మానస పిల్లలకోసం పరితపిస్తోందన్న సంగతి తనకు తెలియదా? తనకు లేదా ఆ బాధ? కానీ, ఆ బాధను అలా అలా పెంచుకుంటూ పోతే ఏమి లాభం. ఎవరి పిల్లలనో తెచ్చుకోవాలనుకోవడం, వారిని అడిగి భంగపడడం పద్ధతి కాదు. ఎంత తోబుట్టువులైనా, మానస మీద ఎంత ప్రేమ ఉన్నా, తమ పిల్లలను వదలడంలో మాత్రం స్వార్ధంగా ఉంటారు. అది ప్రేమపూరిత స్వార్ధం అని తను భావిస్తాడు. కాసేపు ఇద్దరూ అక్కడే కూర్చుని ఏవో పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుని ఇంట్లోకి వచ్చేసారు.

పదిరోజుల నుండి పనిమవిషి సీతమ్మ పనిలోకి రావడం లేదు. కబురుపెడితే చెల్లెలు పోయిందిట సడన్ గా. ఊరు వెళ్లిందని ఆమె ఇంటిపక్కనున్నామె చెప్పింది. అనుకోకుండా ఆరోజే పనిలోకి వచ్చిన సీతమ్మను అడిగింది. 'ఏమైంది సీతా, మీ చెల్లెలు ఎలాచనిపోయింది?"

"ఏమి సెప్పమంటావమ్మా, దాని బతుకుని దాని పెనిమిటే నాశనం చేసాడు. ఒట్టి తాగుబోతు ఎదవ. ఇది ఏదో సిన్నా, సితకా పనులు చేసుకుని అంతో గింతో సంపాదింస్తుంటే ఆ యెదవ ఆ డబ్బులు లాక్కుని తాగి తందనాలాడేవాడు. ఎదురుతిరిగితే చితక్కొట్టే వాడు. మాకీ విసయాలు తెలిసినా మేమేమి సేయగలమమ్మా. ఇక్కడ మా జీవితాలూ అంతంత మాత్రమే. నా ముగ్గురు బిడ్డలను సాకడానికే నాకు కష్టమౌతోంది. ఆరోజు మొదటి తారీఖున మా సెల్లి డబ్బులియ్యలేదని, బిడ్డను తీసుకుపోయి ఎవరికో అమ్మేత్తానని బెదిరించాడుట. ఇది లబో దిబో మంటూ ఏడ్చుకుంటూ వాడి ఎనకపడి బిడ్డను ఇడిచిపెట్టమందిట. మరి గైతే డబ్బులియ్యమన్నాడుట. నా సేతికి ఇంకా డబ్బులు

రాలేదని, లేవందిట. తాగిన మైకంలో ఉన్నట్టున్నాడు, దాన్ని కత్తితో పొడిసి సంపాదు చెత్తనా యెదవ. ఆస్పత్రికి తీసుకెల్లినా మా సెల్లిని బతికించుకోలేకపోయాం. ఆ ఎదవని పోలీసోల్లు పట్టుకుపోయారు. దానికా అత్త మామలు ఎవరూ లేరు. పుట్టింటి తరపున నేనొకత్తినీ ఉన్నాను. దానికి మూడేళ్ల గుంట. బంగారు బొమ్మే అనుకో. ఊరోల్లందరూ పిల్లను ఏమి సేత్తావే సీతమ్మా, నీ సెల్లి బిడ్డే కదా, కట్టమో, సుకమో నీయే దాన్ని కాపాడాలంటూ ఆ బిడ్డను నా సేతిలో పెట్టేసరికి ఏమి సెయాలమ్మా, తెచ్చేసుకున్నాను. ఎలా పెంచుతానో, ఏమోనంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది.

దాని ఏడుపు చూసేసరికి మానసకు కూడా దుఃఖం పొంగుకొచ్చింది. ఏమి జీవితాలు వీరివి! కాయా కష్టం చేసుకుంటూ జాగ్రత్తగా సంసారాలు చేసుకుంటే బాగానే ఉంటాయి. కానీ సంపాదించిన సొమ్ము కల్లు తాగడానికే అన్నట్టు ఉంటారు. భార్యా బిడ్డల పట్ల బాధ్యతగా ఉండకుండా తాగిన మైకంలో ప్రాణాలు తీయడానికి కూడా వెనుకాడరు. తర తరాలుగా వీరి జీవితాలు ఇలానే ఉంటున్నాయి. భారంగా నిట్టూర్చింది.

రెండురోజుల తరువాత చెల్లెలి కూతురిని ఎత్తుకుని వచ్చింది పనిలోకి. "అమ్మా మానసమ్మగారూ, మీకో ఇసయం చెప్పాలంటూ పిలిచేసరికి, "ఏ విషయం సీతమ్మా అంటూ దగ్గరకు వచ్చింది. పక్కనే చందమామలాంటి పాపాయి. పచ్చగా, ఒత్తైన జుట్టు ముఖం మీద పడుతుంటే తన చిన్ని చిన్ని చేతులతో పైకి తోసుకుంటూ, ఆల్చిప్పల్లాంటి కళ్లతో మానస వైపే చూస్తోంది. ఆ పిల్ల రాకతో కొత్తవెలుగులు వచ్చేయేమోనన్న భ్రాంతితో మానస ఆ పాపవైపే మైమరచి చూస్తూ ఉండిపోయింది.

"పులిమీద పుట్రలా అయిందమ్మా నా పరిస్తితి. మా మామకి ప్రాణం బాగోలేదట. లేవలేకపోతున్నాడుట. మొత్తం సంసారం వెంటపెట్టుకుని వచ్చేయండంటూ మా అత్తమ్మ కబురుచేసింది. ఇగో, ఈ పిల్లదాన్ని మాతో తీసుకెడితే మా అత్తమ్మ పెద్ద లొల్లి చేస్తుంది. ఒక ఆడపిల్లను పోసించడం మనతరమేటే అంటూ గుండెలు బాదుకుంటుంది. ఏమిసేయాలో దిక్కుతోచడం లేదు. ఒక వారంరోజుల్లో మేము మూటాముల్లె సర్దుకుని పోవాలె. అమ్మా, ఇన్ని సంవత్సరాలు మమ్మలని సక్కగా ఆదుకున్నావు. దయగల అమ్మవి. మరో మనిసిని చూసుకో తల్లీ. ఈ పిల్లను ఏ అనాథాశ్రమంలోనైనా పెట్టాలని చూస్తున్నానంటూ" కంటతడిపెట్టింది.

మానసకు నోటమాట రాలేదు. బంగారంలా ఉంది పిల్ల. నిగ నిగ మెరిసిపోతోంది. సీతమ్మ పిల్లలకంటే ఈ పిల్ల ఎంతో బాగుంది. సరైన పోషణ లేకపోయినా మెరిసిపోతోంది. చక్కగా వేళకి అన్నీ పెట్టి, మంచి పోషణ చేస్తే, ఈ పాప ఉన్నత వంశంలో పుట్టిన పిల్లలా ఉండదూ అని పదే పదే మనసులో అనుకుంది.

"ఏమి చేస్తావులే సీతమ్మా, అత్తమ్మ రమ్మంటే పోవాలికదే. నీవు చెప్పినప్పటి నుండి ఈ పాప గురించే నేనూ ఆలోచిస్తున్నాను. సార్ తో మాట్లాడుతాను, ఎక్కడ ఉంచితే పాప బాగుంటుందో కనుక్కోమంటాను సరేనా!"

"అమ్మా, తల్లీ, అంతమాటన్నావు. నీకు వెయ్యి దణ్ణాలమ్మా. ఎవరైనా ఈ గుంటని ఆదుకుంటారేమో సార్ ను కనుక్కోమ్మా" అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది.

ఆరోజు రాత్రంతా ఆలోచిస్తూనే ఉంది. ఎందుకో ఆ పాపను తామే పెంచుకుంటేనన్న ఆలోచన ఒక చిన్న బీజంగా మెదడులో పడిపోయింది. అది మెల్లి మెల్లిగా చిగురించడం మొదలుపెట్టసాగింది. కళ్లముందు హఠాత్తుగా ఒక వింత వెలుగు ప్రత్యక్షమైంది. ఎందుకాలోచిస్తావు మానసా? తల్లీ తండ్రీ లేని ఒక పసికందుని ఆదుకునే అవకాశాన్ని వదులుకోకంటూ తనతో మృదువుగా బోధిస్తున్న అనుభూతి కలిగింది. తన పక్కనే నిద్రపోతున్న రాజేంద్రను నెమ్మదిగా తట్టి లేపి కూర్చోపెట్టింది. తన ఆలోచనను వివరించింది. ఆ రాత్రివేళ భార్య ముఖంలో ఎప్పుడూ కనపడని వింతకాంతులేవో విరజిమ్ముతున్నాయి. అతని మనస్సు అర్థమైంది. భార్య భుజం చుట్టూ

ఆప్యాయంగా చేతులేస్తూ, "నీ ఇష్టమే నా ఇష్టం మనూ!" ఇన్ని రోజులూ నీ దిగులూ, బాధనూ అర్థం చేసుకోలేదని నీవనుకోవచ్చు. కానీ నీ ముఖంలో కదలాడే నీలినీడలు, ఈ వయస్సులో నీవనుభవిస్తున్న ఒంటరితనం నన్ను కొద్దికాలంనుండి ఆలోచింప చేస్తున్నాయి. నీ ముఖంలో ఆనందాన్ని ఎలా చూడగలనని అనుక్షణం ఆలోచిస్తూనే ఉన్నాను. నా ఆలోచనలకు ఈనాటికి ఒక అందమైన రూపం ఏర్పడింది.

రాజేంద్ర మాటలకు మానస ముఖంలో వెల్లివిరుస్తున్న ఆనంద భావ వీచికలను వీక్షించడానికి చంద్రుడు మబ్బుల చాటునుండి బయటకు వచ్చేసాడు. కిటికీలోనుండి చంద్రకిరణాలు మానస చెక్కిలిపై పడి వింతకాంతు లీనుతున్నాయి. చంద్రకాంతి తో మెరిసిపోతున్న భార్య ముఖాన్ని, ఆమె పెదవులమీద నాట్యమాడుతున్న హాసరేఖని పరవశంగా చూస్తున్నాడు రాజేంద్ర. అతని మనస్సు ఆనందంతో నిండిపోయింది.

ఇంక తెల్లవారేకా హడావిడి మొదలైంది. పాపను దత్తత తీసుకునే ప్రక్రియలో రాజేంద్ర తన మిత్రుడైన లాయర్ సుదర్శన్ ను సంప్రదించాడు. దత్తత స్వీకరణ నియమ నిబంధనప్రకారం చట్టబద్ధంగా స్వీకరించాలి. అప్పుడే భవిష్యత్ లో ఏ సమస్యలూ తలెత్తవని లాయర్ చెప్పారు. ఆయన చట్టబద్ధంగా ఈ ప్రక్రియను పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు.

సీతమ్మనూ, ఆమె భర్తనూ పిలిపించి పాపను తాము పెంచుకుంటామని, దత్తత తీసుకుంటామని చెప్పేసరికి ఆ దంపతులు మానస, రాజేంద్ర కాళ్లపై పడి దణ్ణం పెట్టుకున్నారు. చనిపోయిన తన చెల్లి ఆత్మ సంతోషిస్తుందని, చల్లని మీ నీడలో పాప చక్కగా పెరిగి పెద్దదౌతుందని చెపుతూ మురిసిపోయారు. సీతమ్మా, ఆమె భర్త రంగయ్య ఎంతో మంచివాళ్లు. రంగయ్యకు తాగుడులాంటి దురల్వాటులేమీ లేవు. సంసారపక్షంగా కుటుంబం పట్ల నియమబద్ధంగా ఉంటాడు.

రాజేంద్ర, మానస సీతమ్మ దంపతులతో "మీ పాపకు వెల కడ్తున్నామని అనుకోకండి. మీరు బాగుంటేనే మా పాప కి కూడా మంచిది. మీ సంతోషం మా పాపకు ఆశీస్సులౌతాయి. ఇది మేము మీకు మామూలుగా చేస్తున్న సహాయం. ఇన్ని సంవత్సరాలు మా ఇంట్లో నమ్మకంగా పనిచేసారు. ఏదైనా పొలం కొనుక్కుని వ్యవసాయం చేసుకుని, మీ పిల్లలను మంచి ప్రయోజకులను చేయండంటూ పది లక్షల రూపాయలు వారికి అందచేసారు. సీతమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంటూ, "అమ్మా మీరు మాకు డబ్బులియ్యకపోయినా ఫరవాలేదు. తల్లీతండ్రీ లేని ఆ చిన్ని గుంట ఏ దిక్కూ లేకుండా అనాధలా పెరుగు తుందేమోనని ఆరాటపడ్డాను. దేవతలా దాన్ని ఆదుకున్నావమ్మా అంటూ సంతోషంతో కన్నీళ్లు పెట్టుకుంది.

మరో ఆరునెలల తరువాత నందినికి, శరత్ కి ఆహ్వానాలు వెళ్లాయి. ఒక పాపను దత్తత తీసుకుంటున్నామని ఆ శుభ కార్యక్రమానికి తప్పక రమ్మనమని మానస పదే పదే చెప్పింది.

నందిని, శరత్ లు కుటుంబాలతో వచ్చేసారు. "ఏమిటక్కా, ఇంత సడెన్ గా, ముందుగా చెప్పనైనా లేదంటూ" కాస్తంత నిష్టూరంగా మాట్లాడారు. మానస పరిస్తితి వివరించింది. లీగల్ రైట్స్ వచ్చేవరకు ఎవరికీ చెప్పాలనుకోలేదని.

"నీవు దత్తత తీసుకుంటానంటే, నా కూతుళ్లల్లో ఒకదాన్ని ఇవ్వలేనా అక్కా!" అంటూ కాస్తంత కినుకగా అన్నాడు శరత్.

"ఒరేయ్ శరత్, ఉష డెలివరీ సమయంలో మీ కూతుళ్లను నా దగ్గర కొంతకాలం ఉంచుకుంటానని ఎంత బ్రతిమాలినా నీవూ, ఉషా ఏమన్నారో గుర్తుచేసుకోండి. అటువంటిది మీరు మీ కూతురిని దత్తత కిస్తారని ఎలా అనుకోమంటావురా?" నీకు చూడాలనిపించినప్పుడల్లా రావచ్చన్నారు. అందుకే పదే పదే వస్తూ వాళ్లను విడిచి వచ్చేచప్పుడు నా మనస్సు ఎంతలా బాధపడేదో నేను చెప్పలేనురా."

"నందూ, నీవుకూడా!" నీవు మీ పిల్లలతో, ఆఫీస్ పనితో అవస్తపడుతుంటే చూడలేక నీకు విశ్రాంతినిద్దామన్న ఉద్దేశ్యంతో ఆకాష్ ని కొంతకాలం నా దగ్గర పెట్టుకుంటానంటే, వాడిని విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేమని, అయినా నాకు పెంచడం తెలియదంటూ

మాట్లాడావు." అటువంటిది నాకు దత్తతనివ్వమని ఎలా అడగగలనే?" సరే, జరిగినవి గుర్తు చేసుకుంటూ మనస్సు పాడు చేసుకోదలచుకోలేదు.

ఎవరిపిల్లలు ఎవరికీ బరువుకాదు. మీకు మీ పిల్లలను చక్కగా పెంచుకుని, ప్రయోజకులను చేయగలిగే స్తోమత ఉంది. తల్లితండ్రులుగా మీరు వారి వెన్నంటే ఉంటారు. అనుక్షణం కంటికి రెప్పలా చూసుకుంటారు. "కానీ, ఈ పాప ప్రత్యూషకి!" తల్లీతండ్రీ లేని అనాథ పిల్ల. ఇప్పుడు నేనూ, మీ బావ పాపాయికి తల్లితండ్రులం. ఒక అనాథ పాపకు మంచి జీవితాన్ని అందించామన్న తృప్తి దేనితోనూ సాటిరాదు. మీరు ఈ కార్యక్రమానికి వచ్చారు. చాలా సంతోషమర్రా. " ప్రత్యూషని దీవించండంటూ" పాపాయిని వారి చేతికి అందించింది.

ముద్దులు మూటకడుతున్న పాపాయిని చూసి నందిని ముచ్చటపడిపోయింది. "పాప బంగారు బొమ్మక్కా" అంటూ పాపను ముద్దు పెట్టుకుంది. మానసను ఆప్యాయంగా కౌగలించుకుంటూ, "నన్ను క్షమించక్కా. నీ మనసుని బాధ పెట్టాను. నా పిల్లలను చూడాలని అగ్గగ్గలాడుతూ ఇక్కడనుండి వచ్చేదానివి. నీ మనసులోని ప్రేమను గుర్తించలేకపోయాను. ఏది జరిగినా మన మంచికే అన్నట్లుగా భగవంతుడు ఈ రూపేణా నిన్ను అమ్మను చేసాడు. ప్రత్యూష మాకూ బిడ్డే నంటూ అక్క బుగ్గమీద ముద్దుపెట్టుకుంది." శరత్, ఉషలు కూడా "అక్కా మమ్మలని కూడా క్షమించేయవూ అంటూ దీనంగా చూసారు."

ఆనాటి ఉషస్సు తొలి వెలుగు రేఖలు విచ్చుకుంటుండగా, ప్రత్యూష "అమ్మా అంటూ" ముద్దుగా గారాలు పోతూ మానస గుండెలకు హత్తుకుపోయింది. ఆ పిలుపు మానస హృదయం లో కోటివీణలు మ్రోగినట్లుగా అనుభూతి పొందింది.

Post your comments